చిరుధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:-స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో చిరుధాన్యాలు సాగుపై గిరి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. సాగు విధానం, కలిగే ప్రయోజనాలపై వివరించారు. అనంతరం అగ్రికల్చర్ ఏడి పి.శ్రీధర్‌రావు, చింతపల్లి ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త పి.జోగారావు రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రాగి పంటను గులిరాగి పద్ధతిలో సాగు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిని సిహెచ్ నీలవేణి, ఆర్‌బికే సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఏడి

పసుపును నేరుగా..

రైతుల నుండి కొనుగోలు చేయాలి

▸▸ట్రేడర్లకు పూర్తి సహాయ సహకారాలు ▸▸ కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో ఉత్పత్తి చేస్తున్న పసుపు పంటను ట్రేడర్లు నేరుగా గిరిజన రైతుల నుండి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. గిరిజన రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. దళారులతో గిరిజన రైతులకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉద్యానవన శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, పసుపు ట్రేడర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పసుపు కొనుగోలులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజన రైతుల నుండి కొనుగోలు చేస్తే మంచి ధర అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపునకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. వారపు సంతలలో పసుపు కొనుగోలు చేయడానికి ప్రత్యేక ఏరాట్లు చేస్తామని తెలిపారు. మధ్యవర్తులతో గిరిజన రైతులు నష్టపోతున్నారని, వీరికి విక్రయించకుండా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ట్రేడర్లకు అవసరమైన మంచి నాణ్యత, తగినన్ని నిల్వలు సమకూరుస్తామని చెప్పారు. ట్రేడర్లకు ఎంత మేరకు సరుకు కొనుగోలు చేస్తారో తెలియజేస్తే ఆ మేరకు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖల నుండి ట్రేడర్లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లో రైతులు అత్యధికంగా పసుపు సాగు చేస్తున్నారని చెప్పారు. పసుపు ఉడికించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పసుపు కొమ్ములు ఎలా ఉండాలి, ఎంత మేరకు తేమ ఉండాలి అనే అంశములపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పసుపు నాణ్యత పరీక్షా ల్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, మార్కెటింగ్ సహాయ సంచాలకులు రాకేష్, పలువురు పసుపు ట్రేడర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ ఆర్డినెన్స్‌పై

అసెంబ్లీలో చట్టం చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తూ ఆర్డినెన్సు తెస్తున్నట్లు విడుదల చేసిన జివోపై గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తుందని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ముఖ్యమంత్రికి లేఖ రాయడం, కెవిపిఎస్ సహా అనేక దళిత, గిరిజన సంఘాలు, ఇతర ప్రజాసంఘాలు దీన్ని కొనసాగించాలని ఆందోళనలు, వినూత్న నిరసనలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ 'ఆర్డినెన్సు'ను అసెంబ్లీలో చట్టం రూపంలో తీసుకు రావాలన్నారు. ఆ సమయంలో పాత చట్టంలో ఉన్న లోపాలను సరి దిద్దాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి కోసం చట్టం తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సబ్‌ప్లాన్‌కు చట్టబద్దత కల్పిస్తూ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, గిరిజన సంఘం అధ్యక్షుడు గత్తుం బుజ్జిబాబు, నాయకులు పి నానిబాబు, సిహెచ్ ప్రసాద్, తదతరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్

చీఫ్ ఇంజినీర్‌గా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -మోతుగూడెం

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా బొడ్డు శ్రీధర్ సోమవారం చింతూరు మండలం మోతుగూడెంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్ ఇంతకు ముందు ఏపీ జెన్కో విద్యుత్ సౌదంలో చీఫ్ జనరల్ మేనేజర్ ఏడీఎంగా విధులు నిర్వహించారు. ఇక్కడ చీఫ్ ఇంజనీర్‌గా పని చేసిన రాంబాబు గతేడాది జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో జులై 1 నుంచి ఇప్పటివరకు ఓ అండ్ డ్యామ్ ఎస్ఇ వెంకటేశ్వరరావు ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సోమవారం ఆయన స్థానంలో చీఫ్ ఇంజనీర్‌గా బొడ్డు శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌కు ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఎస్ఈ (ఓ అండ్ డ్యాం) వెంకటేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, సివిల్ విభాగానికి చెందిన ఇఇలు జాకీర్ హుస్సేన్, బాబురావు ఏఎస్ నాగేశ్వరరావు, సీనియర్ అకౌంటు ఆఫీసర్ వి.ప్రసాద్, జెన్కో ఇంజనీర్లు, కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.

ఐటిడిఎ ఎపిఒగా సుజాత బాధ్యతల స్వీకరణ

చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు రెవెన్యూ డివిజన్‌లోని ఐటీడీఏ ఏపీవోగా కంచర్ల సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె ఏటిడబ్ల్యుఒగా చింతూరు డివిజన్లో విధులు నిర్వహిస్తున్నారు.



ఐటిడిఎ ఎపిఒ సుజాతను అభినందిస్తున్న సిబ్బంది

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర ఏదీ?

కాఫీ రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గెమ్మెలి చినబాబు - రైతులతో వర్క్ షాప్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఇంటర్నేషనల్ మార్కెట్లో అధిక ధర ఉన్నా కాఫీ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించ లేదని కాఫీ రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గెమ్మెలి చినబాబు డిమాండ్ చేశారు. సోమవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో కాఫీ రైతుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాఫీ రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పార్చిమెంట్ కిలో కాఫీ రూ.500, చెర్రీ కాఫీకి రూ.250, కాఫీ పచ్చి పళ్ళురూ.100, మిరియాలు కిలో రూ.1000ల గిట్టుబాటు ధర ప్రకటించాలన్నారు. ఐటీడీఏ అధికారులు రైతుల సంక్షేమం కోసం కనీసం స్పందించ లేదన్నారు. కాఫీ కేజీ రూ.270 విక్రయాలు చేయాలని జిసిసి ప్రకటించినప్పటికి ఈ విధంగా కొనుగోలు చేయలేదన్నారు. అన్ని పంచాయతీల డిపో పరిధిలో కాఫీ కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న రూ.60 కోట్ల కాఫీ రైతుల అభివృద్ధి ప్రోత్సాహక నిధులు రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. మూడు, నాలుగు సంవత్సరాలు దాటినా నేటికీ జమ చేయకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి కాఫీ రైతుకి బేబీ పార్చిమెంట్ మిషన్, నిచ్చెనలు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఆర్గానిక్ కాఫీ తోటలకు పట్టాలు, నష్టం వాటిల్లినప్పుడు ఇన్సూరెన్స్, తోటలో ప్రమాదం జరిగితే నష్టపరిహారం, బ్యాంకు రుణాలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ మార్కెట్లో కప్పు కాఫీ రూ.600 ఉండగా పండిస్తున్న రైతులకు మాత్రం గిట్టు బాటు ధర లేకపోవడం బాధాకరమన్నారు.అల్లూరి జిల్లాలో ప్రతి మండలానికి కాఫీ ప్రాసెస్ యూనిట్లు మంజూరు చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతుల సంఘం నాయకులు సిహెచ్ గురుమూర్తి, పాంగి నానిబాబు, సిహెచ్ ప్రసాద్, పి.రామన్న, బి.కోగేశ్వరరావు, జి.బుజ్జిబాబు, కె.ఆనంద్ కుమార్, కాఫీ రైతులు పాల్గొన్నారు.

మాట్లాడతున్న చినబాబు

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కంద్రూం పంచాయతీ సబ్ సెంటర్ పరిధిలోని స్వర్ణయ్ గూడా, పనసపుట్, పతలంగి, కుకూడా బెడ్డ గ్రామాల్లోని సోమవారం ఆ పంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిముడు హరి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో వైద్యాధికారి పి.రాంబాబు గిరిజనులకు వైద్య చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం ప్రస్తుత సీజన్లో వివిధ రకాల వ్యాధులు శోకకుండా ఉండేందుకుగాను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలను తెలిపారు.వ్యాధులు ప్రబలినప్పుడు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. నివాస గృహాల చుట్టు పక్కలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలన్నారు. స్వర్ణయిగూడ గ్రామంలోని మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలను సందర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థుల గృహాలకు వైద్యాధికారి వెళ్లి చికిత్స చేశారు. అంబులెన్స్ వైద్యాధికారి సిద్దార్థ రాయ్, ఎంపిహెచ్ఈఓ బాబురావు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యాధికారి

ప్రభుత్వ పథకాల కరపత్రాలను మహిళలకు ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొండగోకరి గ్రామ సచివాలయం పరిధిలో కొత్తపాడి, పాతపాడి, కొత్తరత్నంపేట, పాతరత్నంపేట గ్రామాలలో సోమవారం ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ తిరుగుతూ ఈ మూడేళ్లన్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందించి సంక్షేమ పథకాల గురించి వివరించారు. మొత్తంగా 265 గడపలను భాగ్యలక్ష్మి సందర్శించారు. సమస్యలను తెలుసుకుంటూ... అవ్వతాతలతో మాట్లాడుతూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, కొండగోకరి సర్పంచ్ రేగటి ముసలి నాయుడు, ఇతర గ్రామాల సర్పంచ్‌లు పాటి నూకరత్నం, జంప రాజకుమారి, రావుల వెంకటలక్ష్మి, పొట్టిక శ్రీను, సుర్ల చంద్రరావు, ఎంపిటిసిలు సద్దాం మల్లేశ్వరి, బడిజన అప్పారావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి సత్యనారాయణ, సడ్డా సావిత్రి, కాళ్ళ వనం బాబు, బండి సుధాకర్, దోని బాబ్జి, గాడి అచ్చిబాబు, కసరాజు రవి, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈవో పాల్గొన్నారు.

హెల్త్ వాలంటీర్లను నియమించాలి

- ప్రజా సంఘాల నేతలు

- 36వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ గేట్ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 36వ రోజు కొనసాగాయి. ఈ దీక్షలను ఉద్దేశించి ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు ఆశ్రమ హాస్టల్స్‌లో తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. 260 మంది హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే పునరుద్ధరిం చాలని, వారికి నాలుగు నెలల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు మద్దతు తెలిపిన ఆదివాసి వికాస్ పరిషత్ జిల్లా అధ్యక్షులు బూడిదె చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రజా సంఘాల వేదిక నాయకులపై కొంతమంది ఉపాధ్యాయ సంఘం నేతలు అసత్య ఆరోపణలు చేయడం తగదని, చేతనైతే ప్రత్యక్ష ఉద్యమాల్లో పాల్గొవాలని హితవు పలికారు.తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, వరుసగా ఆరుగురు విద్యార్థులు మృతి చెందితే స్పందించని ఉద్యోగ సంఘ నాయకులు ఐటిడిఎ పిఒకు వత్తాసు పలుకుతూ మాట్లాడటం సరికాదన్నారు. ఎవరు మెప్పు కోసం మాట్లాడుతున్నారో ఆదివాసి సమాజం గమనిస్తూనే ఉందని తెలిపారు.పాడేరు ఐటీడీఏ పీవోను తక్షణమే సరెండర్ చేయాలని, విద్యార్థుల మరణాలపై హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆదివాసి వికాస్ పరిషత్ అధ్యక్షులు వి.మత్యలింగం, కాముడు రాజుబాబు, పి బుజ్జి సుందర్, ఎస్,కృష్ణవేణి, జి.స్వప్న, నాయకులు చిన్నారావు, బత్తిరి నరేష్, కంబిడి లతకూమరి, స్వరూప పాల్గొన్నారు.



పథకాల సంచికను ఇస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కొర్ర పంచా యతీ పరిధిలోని కొర్రా, గొందివలస, భల్యవలస, గ్రామాల్లోని సోమవారం ఆ పంచాయతీ సర్పంచ్ ఎంపీటీసీ లకే అర్జున్, జి.విజయ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే చెట్టి చెట్టి ఫాల్గుణ హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు ప్రవేశ పెడుతుందని తెలిపారు. ఆయా పథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులు అందిపుచ్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పిటిసి సభ్యురాలు చటారి జానకమ్మ, మండల వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, మండల వైసీపీ అధ్యక్షులు శెట్టి గోపాల్, మాజీ జడ్పిటిసి సభ్యుడు శ్రీ రాములు, పోతాంగి గ్రామ పంచాయితీ సర్పంచ్ వెంకటరావు, వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

భూముల రీ సర్వే పక్కాగా నిర్వహించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. భూహక్కు భూరక్ష ప్రోగ్రామ్‌పై స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహశీల్దార్లు, మండల సర్వేర్లు, సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్‌తో సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి పిఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంతమంది తహశీల్దార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లోని సుమారు 539 గ్రామాలకు గాను ఇప్పటివరకు 98 గ్రామాలలో భూముల రీ సర్వే చేయడం జరిగిందని తెలిపారు. సర్వే టీంలు ప్రతిరోజు సకాలంలో ఆయా గ్రామాలలో అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. సర్వే చేసిన వివరాలన్నీ ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలోని ఒక్కొక్క మండలంలో ఎన్ని సర్వే టీంలు, ఎన్ని డీజీపీ మిషన్లో పనిచేస్తున్నాయో, ప్రతిరోజు ఒక్కొక్క మండలంలో ఎన్ని ఎకరాలు రీసర్వే చేస్తున్నారో మండలాల వారిగా ఆరా తీశారు. వచ్చే జూన్ చివరి నాటికి ఈ రీ సర్వేలన్నీ పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ భూములకు సంబంధించిన బౌండరీల సమస్యలు ఉంటే ఈ విధంగా పరిష్కరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ అన్ని మండలాల్లోనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీ సర్వే చేయాలన్నారు. అన్ని ప్రైవేట్ భూములు, ప్రభుత్వ భూములకు రీసర్వే చేయడానికి ఆయా గ్రామాలలో ముందుగా గ్రామ సభలు నిర్వహించాలన్నారు. టార్గెట్ ప్రకారం సర్వే చేయుటకు సర్వే టీంలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దార్లు సిహెచ్.శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, పి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, నాగభూషణం, రాజశేఖర్, డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, అధికారులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలని రాస్తారోకో

ప్రజాశక్తి- విఆర్.పురం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పెద్దమటపల్లి గ్రామం వద్ద రైతులు రాస్తారోకో చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే కొనసాగించాలని, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడారు ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేసి ఆపేయడం సరికాదని, ఇంకా రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాల వద్ద పని చేసిన హమాలీలకు ఇవ్వాల్సిన చార్జీలను ఇప్పటిదాకా ఇవ్వలేదని, వెంటనే వారికి చార్జీలను చెల్లించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెట్టి లక్ష్మి, రైతు సంఘం, సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, వడ్లది రమేష్, ముసురు వేంకటేశ్వర్లు, కుంజా నాగిరెడ్డి, కల్లు చిన్నయ్య, గుండె పూడి లక్ష్మణరావు, మోసం రాముడు, పెద రామారావు, గుజ్జా శ్రీనివాస్, తుర్రం జోగారావు, తుర్రం వెంకటమ్మ, కుజా బొబ్జి, బీరబోయిన రాజు, రాంబాబు రైతులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

ఉపాధి హామీ పనుల్లో కొలతలు సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జరుగుతున్న ఉపాధి పనుల్లో ఉపాధి మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా కొలతలు వేయాలని స్థానిక ఎంపీడీవో కె బాపన్నదొర ఆదేశించారు. సోమవారం రాజవొమ్మంగి పంచాయతీ పరిధిలో వైయ్యేడు గ్రామంలో జరుగుచున్న ఉపాధి హామీ చెరువు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేతనదారులు హాజరు సక్రంగా ఉండాలని, కొలతలు ప్రకారం ఉపాధి పనులు చేయాలని ఆదేశించారు. ప్రతి వేతనదారులకు కొలతలు ప్రకారం వేతనం రూ.225 తక్కువ కాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో బాపన్నదొర శాంతినగర్ జిపిఎస్ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- చింతూరు

మండల కేంద్రంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం లారీ, ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత డ్రైవర్లకు ప్రభుత్వ నిబంధనలతో కూడిన సూచనలు తెలియజేశారు. డ్రైవర్లు అందరూ తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రమాదకరమైన ప్రదేశాల వద్ద ఏర్పాటు చేసిన సైన్ బోర్డులు, సిగ్నల్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో మేజిక్ లారీ యునియన్స్ నాయకులు, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్లతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

స్పందనలో వినతులు స్వీకరిస్తున్న పిఒ, ఇతర అధికారులు

1ప్రజాశక్తి - రంపచోడవరం : స్పందనలో వచ్చిన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే స్పష్టం చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి, మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో పిఒ సూరజ్ గనోరేతోపాటు సబ్‌కలెక్టర్ శుభం బన్సల్, ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు స్పందనలో పాల్గొని అర్జీలను స్వీకరించారు 64 దరఖాస్తులు రాగా, వాటిలో వై రామవరం మండలం చింతలపూడి పంచాయతీలో 100 మంది రైతుల భూమిని సర్వే చేసి మ్యుటేషన్ చేయించాలని చింతలపూడి ఉపసర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి. పల్లాల. దేవిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. ప్రమాదంలో విరిగిపోయిన తమ కొడుకు కాలును ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించాలని వై రామవరం మండలం భీముడుగడ్డ గ్రామానికి చెందిన కత్తుల లచ్చిరెడ్డి వేడుకున్నాడు. జీవనోపాధికి ఆవులు. గేదెలు సబ్సిడీపై మంజూరు చేయాలని రాజవొమ్మంగి మండలం కింద్రా గ్రామానికి చెందిన యల్.రామిరెడ్డి అర్జీ సమర్పించారు. అడ్డతీగల మండలంలోని రాయిగూడెం గ్రామంలో సర్వే నెంబర్లు 21/4,20/3 గల భూముల సమస్య పరిష్కరించాలని ముర్రం రాంబాబు దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం తాడేపల్లి పంచాయతీలోని నీలవరం నుంచి మారేడుమిల్లి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఐదు కిలోమీటర్లకు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించి రోడ్డు మంజూరు చేయాలని రేవుల ప్రతాపరెడ్డి. కత్తుల ఆదిరెడ్డి. కత్తుల భూమిరెడ్డి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇఇలే డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, నాగేశ్వరరావు, వెలుగు ఎపిడి ఎ. శ్రీనివాసరావు. డిఎల్‌డిఒ కె. కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన. డాక్టర్ రాధిక. పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ గోపిక ,పిహెచ్ఒ కె.చిట్టిబాబు, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల నాగరాజారెడ్డి. మలేరియా అధికారి రామకృష్ణ. సిడిపిఒ సంధ్యారాణి, డిఇఇలు సాయి సతీష్, శ్రీనివాసరావు,శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రాజేంద్ర బాబు, పిఎఒ రాంబాబు, ఎడిఎలు సిహెచ్ కెవి చౌదరి. సావిత్రి, ఏజెన్సీ డిఇఒ, గిరిజన సంక్షేమశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, డివిజినల్ సివిల్ సప్లై అధికారి సి. శ్రీహరి, డిటి తాతారావు. చైతన్యబాబు విశ్వనాథం, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి యం.సావిత్రి. ఎస్ఒ కబోది. పాల్గొన్నారు,

బస్‌షెల్టర్ పునర్నిర్మించరూ..

మురుగునీటి నిలయంగా మారిన బస్‌షెల్టర్ కూల్చేసిన ప్రాంతం

1ప్రజాశక్తి -మోతుగూడెం :అల్లూరి జిల్లా మోతుగూడెం గ్రామంలో బస్‌షెల్టర్, మూత్రశాలలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.గతంలో నిర్మించిన బస్‌షెల్టర్, మూత్రశాలలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారడంతో వాటికి కూల్చేశారు.అయితే మూడు నెలలు గడస్తున్నా నేటికీ పునర్నిర్మించలేదు. దీంతో ఇటు ఒడిషా, విశాఖపట్నం అటు రాజమండ్రి, భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఇక్కడ ప్రయాణికులు రద్దీకూడా ఎక్కుడా ఉంటోంది. ఈ నేపథ్యంలో మూత్రశాలలు లేక ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాక కూల్చేసిన ఖాళీ ప్రదేశం పందులు, కుక్కలకు నిలయంగా మారడంతో పారిశుధ్యం క్షీణించి, దుర్గంధం వ్యాపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే పంచాయతీలో నిధులు లేవని నిధులు వచ్చిన తరువాత పని మొదలుపెడతామని స్పష్టం చేశారు. గ్రామ సర్పంచి వివరణ కోరగా, సంబంధిత కాంట్రాక్టర్ వేరే దగ్గర పనిచేస్తున్నాడని, ఈ వారంలో పని మొదలుపెడతామన్నారు.

మండల పరిషత్ నిధుల వినియోగంపై సమాచారం ఇవ్వండి

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు దరఖాస్తు ఇస్తున్న ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు హరి

ప్రజాశక్తి -హుకుంపేట: మండల పరిషత్‌కు వివిధ పద్దుల కింద వచ్చే నిధులు, వాటి ఆదాయ, వ్యయ వివరాలను సమాచార హక్కు చట్టం కింద ఇవ్వాలని కోరుతూ సోమవారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.రామచంద్రరావుకు వినతిపత్రం ఇచ్చినట్లు ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు మజ్జి హరి తెలిపారు. అన్నారు. 2020-22 ఆర్థిక సంవత్సరాల్లో మండల పరిషత్ నిధులు, ఖర్చుల వివరాలు., ఎంపిపి ఛాంబర్ అభివృద్ధికి ఏ నిధులు, ఎంత కేటాయించారు, అవి ఎంత మేర ఖర్చు చేశారో వివరాలతోపాటు ఎంపిటిసిల వారీగా కేటాయింపులు, వాటితో చేపట్టిన పనులు, వ్యయ వివరాలను కోరినట్లు తెలిపారు. నిర్దేశిత గడువులోగా సమాచరం ఇవ్వకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. వైసిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శి ఎన్. సత్తిబాబు, ఎంపిటిసి బాలకంంర్‌ృష్ణ

వెలుగు కార్యాలయం వద్ద మంచినీటి బోరు

బోరుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయం వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన మంచినీటి బోరును ఎంపిడిఒ కె బాపన్నదొర తదితరులు సోమవారం ప్రారంభించారు బోరు ఏర్పాటు చేయడం ద్వారా వెలుగు కార్యాలయ సిబ్బందికి, డ్వాక్రా మహిళలకు, ఉపాధి హామీ కార్యాలయం, ఎంఆర్‌సి సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కలుగుతుందని ఎంపిడిఒ అన్నారు.

ట్రాఫిక్ వలయంలో పాడేరు!

- ఇరుకు రోడ్లతో నిత్యం ప్రజలు, వాహనదారుల ఇక్కట్లు
- జిల్లా కేంద్రమైన తర్వాత మూడింతలు పెరిగిన రద్దీ
- అమలుకు నోచుకోని మూడు రోడ్ల అభివృద్ధి ప్రతిపాదన

వచ్చిపోయే వాహనాలతో కిటకిటలాడుతోన్న పాడేరు మెయిన్‌రోడ్డు

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రమైన తర్వాత పాడేరులో వాహన రాకపోకల రద్దీ గణనీయంగా పెరిగింది.పాడేరు పరిసరాల్లో వంజంగి హిల్స్, కొత్తపల్లి జలపాతం, లంబసింగి వంటి ప్రాముఖ్యత కలిగిన పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి బాగా పెరిగింది. దీనికి తోడు జిల్లా కేంద్రం కావడంతో ఇప్పటికే ఉన్న ఐటిడిఎ కార్యాలయంలోపాటు కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, డిఆర్‌డిఎ వంటి పలు జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాల ఉండడంతో వివిధ పనులపై వచ్చే ప్రజల సంఖ్యకూడా పెరిగింది. దీంతో పాటు పాడేరు పట్టణంలో మెడికల్ కళాశాల, పాడేరు నుంచి అరకులోయకు హైవే రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు కూడా జరుగు తున్నాయి. ఫలితంగా జిల్లా కేంద్రం పాడేరుకు వచ్చే బైక్‌లు, కార్లు, బస్సులు ఇతర వాహనాల తోపాటు వాటిల్లో వచ్చేవారి సంఖ్య కూడా పెరగడంతో పాడేరు పట్టణవీధుల్లో జన, వాహన రద్దీ కనిపిస్తోంది. దశాబ్దకాలంలో ప్రతిపాదనలే తప్ప అభివృద్ధికి నోచుకోని పరిస్థితుల్లో పాడేరు పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడం, మరోవైపు వాహన రద్దీ పెరగడంతో పాడేరు పట్టణం ట్రాఫిక్ పద్మ వ్యూహంలో ఇరుక్కుపోయినట్లు కనిపిస్తోంది. పాడేరు పట్టణానికి ఒక చివరన కలెక్టరేట్, మరో చివరన జిల్లా పోలీస్ కార్యాలయం ఉంది. వీటి మధ్య దూరం మూడు కిలోమీటర్లే అయినప్పటికీ, అది పాడేరు పట్టణంలోని మెయిన్ రోడ్డు కావడమే ట్రాఫిక్ సమస్యకు కారణమౌతోందని చెప్పాలి.ఇక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి పాడేరు పట్టణ నడిబొడ్డులో ఉంది. అత్యవసర వైద్య సేవల కోసం చుట్టుపక్కల పది మండలాల నుంచి జిల్లా ఆస్పత్రికి రావడానికి ఇదే మెయిన్ రోడ్డు మీదుగా రావాలి.దీంతో ఒక్కొక్కసారి రోగుల్ని తీసుకువచ్చే అంబులెన్స్ లు ట్రాఫిక్ లో ఇరుక్కుంటున్నాయి.

అమలుకు నోచుకోని మూడు రోడ్ల అభివృద్ధి ప్రణాళిక

పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ నుంచి ఉండే మూడు రోడ్ల అభివృద్ధి ప్రణాళిక నాలుగేళ్లుగా కాగితాలకే పరిమితమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే మూడు రోడ్ల అభివృద్ధికి ఆర్ అండ్ బి అధికారులు అంచనా ప్రతిపాదనలు రూపొందించినా, తర్వాత ప్రభుత్వం మారడంతో నిధులుమంజూరులేక రోడ్డు విస్తరణ కార్యారూపం దాల్చలేదు. జిల్లా కేంద్రమైన తర్వాతైనా పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరణ జరుగుతాయని భావించినా ఆ దిశలో ఎటువంటి పురోగతి లేదు. పాడేరులో రోడ్ల విస్తరణతో పాటు, పాదచారుల రాకపోకలకు ప్లాట్‌ఫామ్స్ నిర్మించాల్సిన తక్షణ అవసరం ఉంది.

పోలీసులకు పరీక్షగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఇప్పుడు పోలీసులకు సవాల్‌గా మారింది. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా ఇక్కడ రోడ్లు విస్తరణ, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో వాహనాలను నియంత్రించడం ఇబ్బందికరంగానే మారిందని చెప్పాలి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలకు వివిధ సరుకులతో వచ్చే లారీలను అన్‌లోడింగ్ కోసం మెయిన్‌రోడ్డులోనే నిలిపేస్తున్న పరిస్థితుల్లో ట్రాఫిక్ జఠిలమౌతోంది. ఒకచోట నిలిపిన వాహనం కదిలితే, మరోవాహనం వచ్చి ఆగుతుండడం వల్ల రోజంతా ఇరుకురోడ్డు మరింత ఇరకాటంగా మారుతోంది. హోటళ్లు, ఇతర దుకాణాలకు వచ్చే కొనుగోలు, వినియోగదారులు తమ బైక్‌లు, ఇతర వాహనాలను రోడ్డు పక్కనే నిలిపేస్తున్నారు. రోడ్డు పక్కనున్న దుకాణ దారులకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపొడుగునా బైక్‌లు, కార్లు, లారీలు ఇతర వాహనాలను ఎక్కడికక్కడే నిలిపేస్తుండడంతో ఇప్పటికే ఇరుకుగా ఉన్న రోడ్డులో రాకపోకలకు మరింత ఇక్కట్లు తప్పడం లేదు. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడే 11మండలాల నుంచి వచ్చేవారితో రద్దీగా ఉండే పాడేరు, ఇపుడు జిల్లా కేంద్రం కావడంతో 22మండలాలకు చెందిన ప్రజలతో కిటకిట లాడుతుందనే చెప్పాలి, మరోవైపు పర్యాటక కేంద్రాల సందర్శనకు వచ్చేవారి సంఖ్యకూడా ఇటీవలకాలంలో గణనీయంగా పెరిగింది. ఇలా అన్ని విధాలుగా ప్రజలు, వాహనరాకపోకలు పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ, అభివృద్ధి మాత్రం జరగలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసుల సంఖ్యను పెంచినా నామమాత్రపు ప్రయోజనమే ఉండే వీలుంది. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిపదినన రోడ్లు విస్తరణ, అభివృద్ధి చేపట్టడంతోపాటు వాహన రాకపోకలను నియంత్రించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

1/70చట్టం రద్దు పిటిషన్‌పై

అఫిడవిట్ దాఖలు చేయాలి

ఇంప్లీడ్ కావాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌ను కోరిన గిరిజన సంఘం నేత అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: 1/70 చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో గిరిజనేతరుడు దాఖలు చేసిన పిటిషన్‌పై అల్లూరి జిల్లా గిరిజనుల తరుపున పాడేరు ఐటిడిఎ పిఒ ఇన్‌ప్లీడ్ కావాలని, దీనిపై సుప్రీంకోర్టులో ఆఫిడవిట్ దాఖలు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గసభ్యుడు పి అప్పలనర్స కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి గిరిజన సంఘం తరపున వినతిపత్రాన్ని అందించారు.

దశాబ్దాల ఉద్యమాలు ఫలితంగా సాధించుకున్న గిరిజన చట్టాలపై తెలంగాణ రాష్ట్రానికి చెందిన సురెడ్డి రమణారెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారన్నారు. గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలు రద్దు చేయించడం ద్వారా మన్యంలోని భూములు, ఖనిజ సంపదతోపాటు గిరిజనులకు రావాల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను తన్నుకుపోవాలన్న దుర్బుద్ధితో రక్షణగా 1/70 చట్టం రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారని కలెక్టరుకు వివరించారు. కే గిరిజన సలహా మండలి తీర్మానంమేరకు సుప్రీంకోర్టులో దాఖలైన జిఒ3 పై రివ్యూ పిటిషన్‌పై నేటికీ విచారణ పూర్తి చేయలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఐదవ షెడ్యూల్ క్లాజ్ టూ ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని టిఎసిలో తీర్మానం చేసి, న్యాయ సలహా పేరుతో అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసి రెండేళ్లవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించకపోవడంతో గిరిజన ప్రాంతంలో గిరిజన యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కొంత భూమిని కోల్పోయిన ఏజెన్సీ ప్రాంతం, జల్లేరు, అభయ్యారణ్యం,ఆయుధాల కర్మాగారంతో మైనింగ్, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం పేరుతో భూమిని 5వ షెడ్యూల్డ్ ఏరియా కోల్పోతోందని కలెక్టరుకు వివరించారు. ఏజెన్సీలో 1/70తోపాటు ఇతర గిరిజన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. గిరిజనలు సాగులో ఉన్నా భూములకు పట్టాలివ్వాలని, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతంగా అనుభవిస్తున్న గిరిజనేతరులపై చర్యలుతీసుకోవాలని కోరారు. 1/70, గిరిజన చట్టాల పరిరక్షణకు ఆదివాసీ, ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నందున దీనిపై పరిశీలించి సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేయాలని కలెక్టర్‌ను గిరిజన సంఘం నేత అప్పలనర్స కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఐటిడిఎ తరపున ఇన్‌ప్లిడ్ అవుతామని స్పష్టం చేశారు.

హుకుంపేటలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఈ సందర్భంగా హుకుంపేట మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. రోడ్డుకు ఇరువైపులా ఖాళీస్థలంలో అక్రమంగా షాపింగ్‌మాల్స్ నిర్మిస్తున్న వారిపై ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని విన్నవించారు దీనిపై కలెక్టర్ స్పందించి, సబ్‌కలెక్టర్‌ను విచారణకు ఆదేశించారు.

కార్యక్రమంలో హుకుం పేట మండల 1/70 చట్టం పరిరక్షణ కమిటీ కన్వీనర్ టి. కృష్ణారావు, వైస్ ఎంపిపి ఎస్.కొండలరావు, మండల కోకన్వీనర్ పట్టం, మత్యపురం సర్పంచ్‌లు పాడి పోతురాజు, సుబ్బారావు, డిఎల్ఒ రాష్ట్ర అధ్యక్షుడు పి. రంజిత్‌కుమార్, టిడిపి నాయకులు పి. కామేశ్వరరావు, రాప, కొట్నపల్లి ఎంపిటిసిలు లక్ష్మమ్మయ్య, స్వాబిబాబు, జనసేన నేత సురేష్, బిఎస్‌పి నేత పాంగి కొండన్న, ఆదివాసీ సేన రాజుబాబు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కె.రామరావు, సిపిఎం మండల కార్యదర్శి కె.లక్ష్మణ పాల్గొన్నారు.1

వారపుసంతలో గిరిజనోత్పత్తుల కొనుగోళ్లపై ఆరా

వారపుసంతలో గిరిజన ఉత్పతుత్లను పరిశీలిస్తున్న ఎఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పెదబయలు : వారపుసంతల్లో గిరిజనోత్పత్తులు అటవీ ఉత్తత్తుల కొనుగోళ్లు, గిట్టుబాటు ధర కల్పన, తూకాల్లో మోసాలపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం పెదబయలు వారపుసంతలో స్థానిక వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తనిఖీలు చేపట్టారు. 16మంది సచి వాలయ సిబ్బందితో కలిసి, సంతలో పర్యటించి, గిరిజనులు పండిస్తున్న వాణిజ్య దినుసులను గిట్టు బాటు ధర ఎలా లభిస్తుందని పరిశీలించారు. ప్రధానంగా వలిసెలు, పసుపు,రాజ్మా చిక్కుళ్లు తదితర గిరిజనోత్పత్తులు మాడుగుల ప్రాంతానికి చెందిన మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేస్తుండడానికి గమనించి, తూకాలపై నిఘా పెట్టారు. ఈ సందర్భంగా మైదాన ప్రాంత వ్యాపారులు తూకాల్లో మోసం చేస్తున్నట్లు గుర్తించి హెచ్చరించారు. గిట్టుబాటు ధర కల్పించడం లేదని పసిగట్టారు. ఇకనుంచి వారపుసంతల్లో గిరిజనోత్పత్తుల కొనుగోళ్లపై నిరంతరం నిఘా ఉంటుందని, గిరిజనులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ ఆర్డినెన్స్‌పై హర్షం



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కొయ్యూరు: ఎస్‌సి, ఎస్‌టి ఉపప్రణాళిక చట్టాన్ని మరో పదేళ్లు పొడిగిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేస్తూ పాడేరు ఎమ్మెల్యే శ్రీమతి కొటగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అభ్యున్నతికి 2013 జనవరి 23న అమల్లోకి వచ్చిన సబ్‌ప్లాన్ చట్టం కాలపరిమితి పదేళ్లు ముగియడంతో దాని కొనసాగింపుపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో సిఎం జగన్ చొరవ చూపి చిత్తశుద్ధితో దీనికి ఆర్డినెన్స్ తెచ్చి మరో పదేళ్లు కనొసాగించడం ద్వారా నిజాయితీ నిరూపించుకున్నారన్నారు. రూ.4,80 కోట్లు వరకూ ఉపప్రణాళిక నిధులుగా ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్‌బాబు, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, ఎంపిటిసి సద్దాం మల్లేశ్వరి, కొండగోకరి, రత్నంపేట సర్పంచ్‌లు రేగటి ముసలి నాయుడు, పాటి నూకరత్నం,బీసీ డైరెక్టర్ గాడి నాగమణి, ఎఎంసి చైర్మన్ జైతి రాజులమ్మ, వైసిపి మండల అధ్యక్షులు జల్లిబాబులు, నాయకులు గాడి సత్యనారాయణ, డౌనూరు ఎంపిటిసి బడిజన అప్పారావు, నల్లగొండ సర్పంచ్ జంప రాజకుమారి, మూలపేట సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, బకలూరు సర్పంచు పొట్టిక శ్రీను, ఆంతాడ సర్పంచు సుర్ల చంద్రరావు, వైఎస్‌ఆర్‌పి మండల మహిళా అధ్యక్షులు సడ్డా సావిత్రి, కంతారం వైస్ సర్పంచు కాళ్ళ వనం బాబు, వైఎస్‌ఆర్‌పి నాయకులు బండి సుధాకర్, మాజీ ఎంపిటిసి దోని బాబ్జి, గాడి అచ్చిబాబు,కసరాజు రవి పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

వధూవరుల కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని దారేల పంచాయతీ గన్నేడ గ్రామానికి చెందిన పాతికేళ్ల నివాసి కొర్ర సింహాచలానికి కించాయిపుట్టు పంచాయతీ రాములు గ్రామానికి పదిహేనేళ్ల బాలికతో జరగనున్న బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం బాల్యవివాహం జరుగుతోందని సచివాలయం మహిళ పోలీస్, అంగన్వాడి కార్యకర్త, గ్రామ పెద్దలు ఇచ్చిన సమాచారం మేరకు సిడిపిఒ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పోలీస్ సిబ్బంది గ్రామానికి వెళ్లి వధూవరులతోపాటు వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అంతేకాక బాల్యం వివాహం చేయడం వల్ల భార్యాభర్తలతోపాటు వారికి పుట్టబోయే పిల్లలకు వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు అమ్మాయికి 18ఏళ్లు నిండేవరకు ఆగి తర్వాత పెళ్లి చేయాలని సూచిస్తూ, బాలికను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. నిబంధనలు అతిక్రమించి వివాహం జరిపిస్తే చట్టరీత్యా నేరస్తులౌతారని హెచ్చరించి వదిలేశారు.

అంగన్‌వాడీల ధర్నాపై సిడిపిఒకు నోటీసు

సిఐటియు నేతల ఆధ్వర్యంలో సిడిపిఒకు నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -చింతూరు. : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 24న ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ధర్నాకు సంబంధించిన నోటీసును సిడిపిఒకు అందజేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అంమలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, ఇతర సౌకర్యాలను కల్పించాలని, ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నెల 24న ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద, వచ్చేనెల 6న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలను అధికసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దాతల సహకారంతో మౌలిక వసతులు

దాతల వితరణతో ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఆర్ఒ ప్లాంట్, బెంచీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హైదరాబాదుకు చెందిన పిజెఎస్ పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్టీఫెన్ పాల్, ఫైలా పాల్ దంపతులు ముందుకొచ్చారు. రూ.5 లక్షలతో రక్షిత మంచినీటి ఆర్ఒ ప్లాంట్, రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు కుర్చీలు, వీల్‌చైర్లు, స్ట్రెచర్ బల్లలు, మార్చురీగదికి చి నీటి సరఫరా సమకూర్చారు. ఏరియా ఆసుపత్రిలో మత్తు డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మేరీ రోహిణి, ప్రవీణ్ దంపతులు చొరవతో ఈ సదుపాయాలు కల్పించేందుకు ఫౌండేషన్ ముందుకు వచ్చింది. రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సురేష్ సహకారంతో ఆసుపత్రిలో పనులు ముందుకు సాగుతున్నాయి.1

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు ఎం.వరహాలరాజు మండల ప్రధాన కార్యదర్శి కిముడు కల్యాణం, కో.అప్పన్, సభ్యులు ఎస్.కె.రెహమాన్, నియోజకవర్గ సాంస్కృతిక అధ్యక్షుడు ఎస్.నాగబ్బాయ్, ఉపాధ్యక్షుడు పి.భీంబాబు, అధికార ప్రతినిధి డి.ఈశ్వరరావు, సీనియర్ నాయకులు వి.గణపతి, ఆర్.కొండబాబు, ఎస్.వెంకట రమణ, డి.త్రినాధ్. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలేజీ ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు

కాలేజీ పరిసరాల్లో తుప్పలు తొలగిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కాలేజీ పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి, పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. సోమవారం ప్రిన్సిపాల్ వినోద్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలోకళాశాల చుట్టుపక్కల తుప్పలు చెత్తాచెదారాలను తొలగించి నిప్పు పెట్టారు. కాలేజీ పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో క్రిమికీటకాలు, అడవి పందులు సంచరించి, ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు ,విద్యార్థులు వీటిని తొలగించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.